# 30 సెకన్లలో 50 బాంబులు


### హమాస్ చీఫ్ కమాండర్‌ను పక్కా ప్లాన్‌తో అంతం చేసిన ఇజ్రాయెల్



న్యూఢిల్లీ, జూన్ 1: హమాస్ చీఫ్ కమాండర్ మహమ్మద్ సిన్వర్‌ను మట్టుబెట్టిన ఇజ్రాయెల్ రక్షణ దళం(ఐడీఎఫ్) మూడు వారాల తర్వాత ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించింది. అత్యంత రహస్య స్థావరంలో తలదాచుకుని, కార్యకలాపాలు నిర్వహిస్తున్న హమాస్ నేతలను పక్కా ప్రణాళిక ప్రకారం హతమార్చామని తెలిపింది. ఈ మేరకు ఇజ్రాయెల్ భద్రతా సంస్థ(ఐఎస్ఏ)తో కలిసి మే 13న జరిపిన దాడిని వివరించే ఓ త్రీడీ వీడియో విడుదల చేసింది. గాజా ఖాన్‌యూనిస్ ప్రాంతంలోని ఓ దవాఖాన కింద సొరంగమార్గం, హమాస్ కంబాట్ కంట్రోల్ సెంటర్ లక్ష్యంగా వైమానిక దాడులు చేశామని పేర్కొంది. ఈ సర్జికల్ స్ట్రయిక్‌లో దవాఖానకు, పౌరులకు ఎవరికీ హాని జరగకుండా కచ్చితత్వంతో కూడిన దాడి చేశామని, 30 సెకన్లలో 50 బాంబులను ప్రయోగించామని వెల్లడించింది. కచ్చితమైన నిఘా సమాచారం, వైమానిక పర్యవేక్షణ ద్వారానే ఇది సాధ్యమైందని పేర్కొంది. హమాస్ ముఖ్యనేతలను లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిలో సిన్వర్‌తో పాటు మరో కీలక నేత మహమ్మద్ షబానా కూడా హతమయ్యాడని తెలిపింది. 2023 అక్టోబర్ 7న మొదలైన యుద్ధంలో జరిపిన కీలక నేతల ఏరివేతలో ఇదొక కీలకమైన దాడి అని పేర్కొంది. హమాస్ టాప్ లీడర్ యహ్యా సిన్వర్ తమ్ముడే మహమ్మద్ సిన్వర్ అని వెల్లడించింది. దాడి ఉద్దేశం కేవలం హమాస్ కమాండ్ నెట్‌వర్క్‌ను అంతం చేయడమే కాకుండా నిఘా సమాచారంతో, కచ్చితమైన దాడి చేయగలమనే సందేశం పంపడం కూడా లక్ష్యమని స్పష్టంచేసింది. హమాస్ కీలక నేతలను అంతమొందించామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ పార్లమెంట్‌లో ప్రకటన చేసిన తర్వాత ఐడీఎఫ్ ఈ వీడియో విడుదల చేసింది. మరోవైపు ఇజ్రాయెల్ దాడిలో 16 మంది చనిపోయారని, 70మంది గాయపడ్డారని హమాస్ ఆధ్వర్యంలోని ఆరోగ్యశాఖ వెల్లడించింది. వీరిలో సిన్వర్ ఉన్నట్టు ధ్రువీకరించలేదు.

## ఆహార కేంద్రం వద్ద ఇజ్రాయెల్ దాడులు

**31 మంది పాలస్తీనీయుల మృతి • 170 మందికి గాయాలు**



రఫా (గాజా స్ట్రిప్): ఇజ్రాయెలీ సంస్థ సహకారంతో గాజా స్ట్రిప్‌లో నిర్వహిస్తున్న ఆహార పంపిణీ కేంద్రానికి దాదాపు ఓ కిలోమీటరు దూరంలో ఇజ్రాయెల్ దళాలు ఆదివారం దాడులు చేశాయి. గాజా ఆరోగ్య శాఖాధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేంద్రానికి ఆహారం కోసం వస్తున్న వారిలో 31 మంది ఈ దాడుల్లో మరణించారు, సుమారు 170 మంది గాయపడ్డారు. ఈ ఫౌండేషన్ విడుదల చేసిన ప్రకటనలో.. ఆదివారం ఉదయం తాము ఆహార పంపిణీ చేసినపుడు ఎటువంటి దాడి జరగలేదని పేర్కొంది. తాము సహాయం చేస్తున్న చోట్ల తొక్కిసలాట, కాల్పులు జరిగినట్లు వచ్చిన వార్తలను తోసిపుచ్చింది. ఇవి ఇజ్రాయెల్ సైనిక ప్రాంతాలని, అక్కడికి వ్యక్తిగతంగా వెళ్లే అవకాశాలు పరిమితమని తెలిపింది.

## ఇంటర్నెట్ లేకున్నా 'ఏఐ' సేవలు

న్యూఢిల్లీ, జూన్ 1: ఇంటర్నెట్ అవసరం లేకుండా పనిచేసే ఒక సరికొత్త ఏఐ యాప్ 'ఏఐ ఎడ్జ్ గ్యాలరీ'ని గూగుల్ తీసుకొచ్చింది. దీని నుంచి శక్తివంతమైన ఏఐ మోడల్ సేవల్ని ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులు ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే పొందొచ్చు. దీని సాయంతో స్మార్ట్‌ఫోన్‌లో వివిధ రకాలను చిత్రాలను రూపొందించటం, కోడ్ రాయటం, సమాధానాలు పొందటం వంటివి చేయవచ్చునని 'గూగుల్' ఒక ప్రకటనలో తెలిపింది. వ్యక్తిగత గోప్యత, భద్రతకు భంగం వాటిల్లకుండా, వేగవంతమైన పనితీరును ఈ యాప్ ద్వారా పొందవచ్చునని తెలుస్తున్నది. యాప్ పనితీరుపై సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ నుంచి ఫీడ్ బ్యాక్ కోరుతున్నది.

## రష్యా వైమానిక స్థావరాలపై

### 40కిపైగా మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ధ్వంసం

# ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడి

- దాడికి ఏడాదిన్నర నుంచి ప్రణాళిక!
- స్వయంగా పర్యవేక్షించిన జెలెన్‌స్కీ
- రష్యాలో రెండు బ్రిడ్జిల పేల్చివేత.. ఏడుగురి దుర్మరణం
- ఉక్రెయిన్‌పై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డ రష్యా
- 12 మంది ఉక్రెయిన్ జవాన్ల మృతి
- నేడు ఇస్తాంబుల్‌లో శాంతి చర్చలు




డ్రోన్ దాడిలో ధ్వంసమైన రష్యా ఎయిర్ క్రాఫ్ట్స్

మాస్కో, జూన్ 1: రష్యా- ఉక్రెయిన్ యుద్ధం తీవ్రరూపం దాల్చింది. రష్యా వైమానిక స్థావరాలే లక్ష్యంగా ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడులకు దిగింది. ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీస్ చేపట్టిన ఈ దాడుల్లో 40కిపైగా రష్యా మిలిటరీ ఎయిర్‌క్రాఫ్టులు ధ్వంసమయ్యాయి. ఉక్రెయిన్-రష్యా మధ్య ఇస్తాంబుల్‌లో సోమవారం శాంతి చర్చలు జరగనుండగా ఈ దాడులు జరిగాయి. రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా కీలక మిలిటరీ స్థావరాలపై ఉక్రెయిన్ ఇంత భారీ స్థాయిలో దాడి జరపడం ఇదే మొదటిసారి అని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. ఉక్రెయిన్ దాడిలో ధ్వంసమైన ఎయిర్‌క్రాఫ్టుల్లో టీ యూ-95, టీయూ-22 వ్యూహాత్మక బాంబర్లు కూడా ఉన్నాయని పేర్కొంది. కాగా, ఉక్రెయిన్‌పై రష్యా కూడా డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. ఉక్రెయిన్ సైనిక శిక్షణ స్థావరంపై రష్యా జరిపిన క్షిపణి దాడిలో 12 మంది సైనికులు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు.

### ఒక వైపు చర్చలు.. మరో వైపు దాడులు

ఇస్తాంబుల్‌లో ప్రత్యక్ష చర్చల కోసం ఇరు పక్షాలు సోమవారం సమావేశమవ్వడానికి ఒక రోజు ముందు రష్యా ఉక్రెయిన్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడి చేయగా, మరో పక్క రష్యాపై ఉక్రెయిన్ వ్యూహాత్మక డ్రోన్ దాడి చేసి భారీగా నష్టాన్ని కలుగజేసింది. ఈ భారీ దాడి కార్యరూపం దాల్చడానికి ఒకటిన్నర సంవత్సరాలు పట్టిందని, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షించారని పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక ఉక్రెయిన్ ఉన్నతాధికారి వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో డ్రోన్లను కంటైనర్ ట్రక్కులలో రష్యా భూభాగంలోకి తీసుకెళ్లినట్టు ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో ఉక్రెయిన్ డ్రోన్ దాడి చేయడం ఇదే మొదటిసారి అని చెప్పారు. రియాజాన్, ముర్మాన్స్క్ ప్రాంతాల్లో కూడా డ్రోన్ దాడులు జరిగాయని రష్యా అధికారులు తెలిపారు. కాగా, సోమవారం ఇస్తాంబుల్‌లో జరిగే శాంతి చర్చలకు తమ ప్రతినిధులను పంపుతున్నామని జెలెన్‌స్కీ ప్రకటించిన రోజే ఈ దాడులు జరగడం గమనార్హం.

### దాడులు నిర్ధారించిన ఇరు దేశాలు

రష్యాలోని ఇర్కుట్స్క్ ప్రాంతంలోని స్రెడ్నీ సెటిల్‌మెంట్‌లోని సైనిక విభాగంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి చేసిందని రష్యా ప్రాంతీయ గవర్నర్ ఇగోర్ కొబ్జెవ్ నిర్ధారించారు. ఒలెన్యా, బెలాయా సహా ఐదు మిలిటరీ బేస్‌లపై దాడి జరిగినట్టు చెప్పారు. పేలుడుతో మర్మాన్స్క్ ప్రాంతంలోని ఒలెన్యా ఎయిర్‌బేస్‌లో పేలుళ్లు సంభవించాయని, దట్టంగా పొగ అలుముకుందని స్థానిక మీడియా నెక్స్టా వెల్లడిస్తూ దానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు విడుదల చేసింది. కాగా, అణ్వాయుధాలను మోసుకెళ్లే విమానాలు ఉండే ఈ ఎయిర్‌బేస్ రష్యా అతి ముఖ్య వ్యూహాత్మక ప్రదేశమని ప్రాథమిక నివేదికలు తెలియజేస్తున్నాయి. కాగా, మూడేళ్ల క్రితం పూర్తి స్థాయి దాడి తర్వాత రష్యా.. ఉక్రెయిన్‌పై అత్యధిక సంఖ్యలో డ్రోన్లను ప్రయోగించిందని ఉక్రెయిన్ వైమానిక దళం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉక్రెయిన్‌పై 472 డ్రోన్లతో రష్యా దాడిచేసిందని, వీటితో పాటు ఏడు క్షిపణులను కూడా ప్రయోగించిందని ఉక్రెయిన్ కమ్యూనికేషన్స్ హెడ్ యూరీ ఇగ్నాట్ తెలిపారు.

### రష్యాలో రెండు బ్రిడ్జిల పేల్చివేత.. భారీ రైలు ప్రమాదం..

రష్యాలోని కుర్స్క్, బ్రయాన్స్క్‌లలో రెండు బ్రిడ్జిలను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పేల్చివేశారు. దీని కారణంగా భారీ రైలు ప్రమాదం సంభవించింది. ఇవి ఉగ్రదాడిగా అనుమానిస్తున్నట్టు రష్యా దర్యాప్తు సంస్థ ప్రకటించింది. శనివారం రాత్రి 10.50 గంటలకు బ్రయాన్స్క్‌లో ఒక రోడ్ బ్రిడ్జిని కొందరు పేల్చివేయడంతో కూలిపోయింది. ఈ బ్రిడ్జి కూలి కిందనున్న రైలుపై పడటంతో అందులోని ఏడుగురు మరణించగా, 69 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు. ఈ రైలు మాస్కో నుంచి క్లిమోవ్‌కు వెళ్తున్నది. లోకోపైలట్ కూడా ప్రమాదంలో మరణించాడు. అలాగే ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు కుర్స్క్ ప్రాంతంలోని ఒక రైలు బ్రిడ్జిని కొందరు దుండగులు పేల్చివేశారు. వంతెన కూలిపోవడంతో అదే సమయంలో దానిపై వస్తున్న ఒక సరుకు రవాణా రైలు వంతెన కింద ఉన్న రోడ్డుపై పడిపోయింది. అనంతరం రైలు ఇంజిన్ (లోకోమోటివ్) మంటల్లో చిక్కుకుంది.



గుర్తు తెలియని వ్యక్తులు పేల్చేయడంతో కుర్స్క్ రీజియన్‌లో కూలిపోయిన ఓ రైల్వే వంతెన

### సైనిక శిక్షణ స్థావరంపై రష్యా దాడి..

*ఉక్రెయిన్ సైనిక శిక్షణ విభాగంపై రష్యా జరిపిన దాడిలో 12 మంది ఉక్రెయిన్ సైనికులు మరణించగా, 60 మంది గాయపడ్డారు. ఇప్పటికే సైనికుల కొరతతో ఇబ్బంది పడుతున్న ఉక్రెయిన్ సైనికుల సామూహిక సమావేశాలు జరపకుండా చర్యలు తీసుకుంటున్నది. క్షిపణి దాడి జరిగిన ఆదివారం మధ్యాహ్నం 12.50 గంటల సమయంలో కూడా ఎలాంటి సామూహిక సమావేశం జరగడం లేదని, అందుకే తక్కువ ప్రాణనష్టం సంభవించిందని ఒక అధికారి తెలిపారు. కాగా, ఉక్రెయిన్ ఉత్తర సుమీ ప్రాంతంలోని ఒలెక్సివ్కా గ్రామాన్ని తాము ఆధీనంలోకి తెచ్చుకున్నట్టు రష్యా రక్షణ శాఖ మంత్రి ఆదివారం ప్రకటించారు.*

## 8న రోదసిలోకి శుభాన్షు శుక్లా

న్యూఢిల్లీ: ఆక్సియోమ్ నాలుగో అంతరిక్ష వాణిజ్య మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా రోదసిలోకి వెళ్లనున్నారు. ఈ నెల 8న ఫ్లోరిడా నుంచి స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ఆయన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నారు. తద్వారా రోదసి యాత్ర చేపట్టిన రెండో భారతీయుడిగా రికార్డు సృష్టించనున్నారు. ఇంతకుముందు రాకేశ్ శర్మ, రష్యా సహకారంతో అంతరిక్షయానం చేసిన సంగతి తెలిసిందే. దాదాపు 40 ఏండ్ల తర్వాత మళ్లీ ఓ భారతీయుడు రోదసిలోకి వెళ్తుండటం విశేషం. నాసా సహకారంతో శుక్లా ఐఎస్ఎస్‌లో వివిధ శాస్త్రీయ పరిశోధనలు చేయనున్నారు. శుక్లాతో పాటుగా పోలండ్ నుంచి స్లావోస్జ్ ఉజ్నస్కీ-విస్న్యూస్కీ, హంగరీ నుంచి టిబర్ కాపు ఐఎస్ఎస్‌కి వెళ్లనున్నారు.

## బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో చిరాగ్ పోటీ!

పాట్నా: కేంద్ర మంత్రి, లోక్ జన్‌శక్తి పార్టీ(రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి బీహార్ ఎన్నికల బరిలో దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ పార్టీ చీఫ్ విప్ అరుణ్ భారతీ ఈ విషయాన్ని ఉటంకిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయన పోస్ట్ ప్రకారం పాశ్వాన్ బీహార్ కేంద్రంగా రాజకీయాలు చేయాలనుకుంటున్నారు. ఆయన బీహార్‌లో ఉంటూ పార్టీకి నేతృత్వం వహిస్తేనే ఇది సాధ్యం. తాను గ్రామాల్లో పర్యటించినప్పుడు పాశ్వాన్ బీహార్‌లో పెద్ద పాత్ర పోషించాలని ప్రజలు డిమాండ్ చేశారని అరుణ్ తెలిపారు. దళిత వర్గానికి చెందిన చిరాగ్ జనరల్ స్థానం నుంచి పోటీ చేసి గెలవడం ద్వారా తాను ఒక వర్గం నాయకుడిగా కాకుండా మొత్తం రాష్ట్రాన్నంతా నడిపించేందుకు సిద్ధంగా ఉన్నానని చాటేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన తెలిపారు.

## ఎన్సీపీకి నాగాలాండ్‌లో భారీ ఎదురుదెబ్బ

### ఎన్‌డీపీపీలో చేరిన ఏడుగురు ఎమ్మెల్యేలు

ముంబై(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)కి నాగాలాండ్‌లో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు అధికార నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీలో చేరారు. ఈ విలీనంతో 60 మంది సభ్యులున్న అసెంబ్లీలో సీఎం నెఫ్యూ రియో నేతృత్వంలోని ఎన్‌డీపీపీ బలం 25 నుంచి 32కి చేరి శాసనసభలో పూర్తి మెజారిటీని సాధించింది. శరద్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలో చీలిక తర్వాత, నాగాలాండ్ యూనిట్ అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి మద్దతు ఇచ్చింది.

## వాణిజ్య సిలిండర్‌పై రూ.24 తగ్గింపు

### 3 శాతం తగ్గిన ఏటీఎఫ్

న్యూఢిల్లీ: హోటల్స్, రెస్టారెంట్స్‌లో వినియోగించే వాణిజ్య ఎల్పీజీ సిలిండర్‌పై రూ. 24, విమానాల్లో ఇంధనంగా వాడే ఏటీఎఫ్‌పై 3 శాతం (రూ.2,414) మేరకు తగ్గిస్తున్నట్టు ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. సవరించిన ధరల ప్రకారం, వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలు ముంబైలో రూ. 1,723, న్యూఢిల్లీలో రూ. 1,647గా ఉన్నాయి. కాగా, గృహ అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. రెండు సంవత్సరాల తర్వాత మొదటిసారి సీఎన్‌జీ, వంటగ్యాస్ ఉత్పత్తికి ఉపయోగించే సహజ వాయువు ధరలను కేంద్రం తగ్గించింది.

## ఆపరేషన్ సిందూర్‌పై వ్యాసరచన పోటీలు

న్యూఢిల్లీ: ఇటీవల పాకిస్థాన్‌పై భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌పై ఈ నెల 1 నుంచి 30 వరకు దేశ వ్యాప్తంగా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు రక్షణ శాఖ ఆదివారం ప్రకటించింది. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన మొదటి ముగ్గురికి రూ.10 వేల చొప్పున బహుమతి అందజేయడమే కాక ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరయ్యే అవకాశం కల్పిస్తామని ఎక్స్‌లో తెలిపింది. అభ్యర్థులు ఆంగ్లం, హిందీలలో వ్యాసాలను పంపాలని కోరింది.

## మైనర్ బాలికపై రెండుసార్లు గ్యాంగ్‌రేప్

బెంగళూరు: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలోని బెళగావిలో మైనర్ బాలికపై ఆరుగురు మృగాళ్లు రెండు నెలల్లో రెండుసార్లు లైంగికదాడి చేశారు. పోలీస్ కమిషనర్ బొరసే భూషణ్ గులాబ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం, బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఒకడు బాధితురాలితో నిరుడు డిసెంబరులో స్నేహం చేశాడు. ఆమెను ఓ నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లాడు. అక్కడికి తన స్నేహితులను పిలిచాడు. వీరంతా కలిసి ఆమెపై అత్యాచారం చేసి, మొబైల్ ఫోన్లలో వీడియోలు తీశారు. వీరిలో ముగ్గురు నిందితులు ఈ వీడియోలను లీక్ చేస్తామని ఆమెను బెదిరించి, జనవరిలో మరోసారి అత్యాచారం చేశారు. నిందితులంతా మేజర్లే. ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు, మరొకడు పరారీలో ఉన్నాడు. సాక్ష్యాధారాలను సేకరించేందుకు ఫోరెన్సిక్ బృందం ప్రయత్నిస్తున్నది.



ఈశాన్య రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. అగర్తలలో వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు సహాయక సిబ్బంది ఇలా తరలించారు.

## ఢిల్లీలో మురికివాడలపైకి బుల్డోజర్లు

### సుమారు 370 ఇండ్లు కూల్చివేత

న్యూఢిల్లీ: బీజేపీ పాలిత ఢిల్లీలో మురికివాడల ధ్వంసంతో వందలాది కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి. చుట్టుపక్కల ఇండ్లల్లో పనిమనిషిగా జీవనం సాగిస్తున్న అనేకమంది మహిళలు ఉపాధి కోల్పోయి ఆవేదనకు గురవుతున్నారు. ఆదివారం ఉదయం జాంగ్‌పురాలో 60 ఏండ్లుగా ఉంటున్న మద్రాసీ క్యాంప్‌ను అధికారులు ఖాళీ చేయించారు. బాధిత కుటుంబాలను నగరం శివారు ప్రాంతంలోని నరేలాకు తరలించారు. మురికివాడలోని 370 ఇండ్లను బుల్డోజర్లతో అధికారులు కూల్చివేశారు. ఇందులో 215 కుటుంబాలకు సుదూరంలోని నరేలాలో ఫ్లాట్స్ కేటాయించారు. మిగిలిన 155 కుటుంబాలకు పునరావాసం దక్కలేదు. దీంతో వీరి భవిష్యత్తు, ఉపాధి అగమ్యగోచరంగా తయారైంది. దక్షిణ ఢిల్లీకి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న నరేలా ఫ్లాట్స్ నుంచి రాకపోకలు సాగిస్తూ, జాంగ్‌పురా చుట్టుపక్కల పనిచేయటం సాధ్యం కాదని పలువురు మహిళలు వాపోతున్నారు. పనికి ఎందుకు రావటం లేదంటూ యజమానుల నుంచి ఫోన్లు వస్తున్నాయంటూ బాధిత మహిళలు ఆవేదన చెందుతున్నారు.

## వరుసగా రెండో నెల 2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు

న్యూఢిల్లీ: స్థూల వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు వరుసగా రెండో నెల రూ.2 లక్షల కోట్లు దాటాయి. ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో రూ.2.37 లక్షల కోట్లు కాగా, మే నెలలో రూ.2,01,050 కోట్లు. నిరుడు మే నెలలో ఈ వసూళ్లు రూ.1,72,739 కోట్లు. ఈ ఏడాది మే నెలలో దేశీయ లావాదేవీల నుంచి వచ్చిన గ్రాస్ రెవిన్యూస్ 13.7 శాతం పెరిగి, రూ.1.50 లక్షల కోట్లకు చేరాయి. దిగుమతుల నుంచి జీఎస్టీ రెవిన్యూ 25.2 శాతం పెరిగి, రూ.51,266 కోట్లకు చేరింది. డెలాయిట్ ఇండియా పార్టనర్ ఎంఎస్ మణి మాట్లాడుతూ, రాష్ట్రాల నుంచి జీఎస్టీ వసూళ్ల వృద్ధిలో అంతరాలపై క్షుణ్ణంగా విశ్లేషణ జరగాలన్నారు. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, తమిళనాడు వంటి పెద్ద రాష్ట్రాల్లో ఈ పెరుగుదల 17-25 శాతం కాగా, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో 6 శాతం వరకు మాత్రమే పెరుగుదల కనిపించిందన్నారు.

## 3,700 దాటిన కరోనా కేసులు

- కొత్తగా 360 మందికి పాజిటివ్
- కొవిడ్‌తో మరో ఇద్దరి మృత్యువాత



న్యూఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ క్రమంగా కోరలు చాస్తున్నది. కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. జూన్ 1 ఉదయం 8 గంటల సమయానికి దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 3,758కి పెరిగింది. వీటిలో అత్యధికంగా కేరళలో 1400 కేసులు, మహారాష్ట్రలో 485, ఢిల్లీలో 436 కేసులు ఉన్నాయి. కొవిడ్‌తో గత 24 గంటల్లో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒకరు కేరళకు చెందినవారు కాగా, మరొకరు కర్ణాటకకు చెందినవారు. కొవిడ్ కారణంగా ఈ ఏడాది ఇప్పటివరకు మరణించిన వారి సంఖ్య 28కి పెరిగింది.

## 2026 అక్టోబర్ 31న సింహస్థ కుంభమేళా

ముంబై (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర నాసిక్‌లో 2026లో జరగనున్న సింహస్థ కుంభమేళా తేదీలను సీఎం ఫడ్నవీస్ ప్రకటించారు. ఆదివారం జరిగిన సమీక్షా సమావేశానికి మంత్రులతో పాటు 13 అఖాడాల అధిపతులు, ప్రతి అఖాడా నుంచి ఇద్దరు సాధువులు, మహంతులు హాజరయ్యారు. కుంభమేళా కోసం రూ.4 వేల కోట్లతో అభివృద్ధి పనులు మొదలు పెట్టినట్టు సీఎం తెలియజేశారు. నాసిక్, త్రయంబకేశ్వర్ రెండు చోట్లా వచ్చే ఏడాది అక్టోబర్ 31న కుంభమేళాను ప్రారంభించనున్నారు.

## ఐరాసలో 20 శాతం ఉద్యోగాల కోత!

*న్యూఢిల్లీ: నిధుల కొరతతో సతమతమవుతున్న ఐక్యరాజ్య సమితి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ 60కిపైగా కార్యాలయాలు, ఏజెన్సీల్లో ఉద్యోగులను తగ్గించాలని నిర్ణయించింది. జూన్ మధ్య నాటికి 20 శాతం మంది ఉద్యోగులను ఇంటికి పంపేందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని ఉత్తర్వులు జారీచేసింది. ఐరాస బడ్జెట్ ప్రస్తుతం 3.72 బిలియన్ డాలర్లుగా ఉన్నది. దీనిని 15 నుంచి 20 శాతం తగ్గించాలని ప్రధాన కార్యదర్శి గుటెరస్ లక్ష్యంగా పెట్టుకున్నారు.*




## ప్రియుడిచ్చిన 30 కోట్ల లాటరీ డబ్బుతో మరో ప్రియుడితో పరార్!

*కెనడా: లాటరీలో 3.6 మిలియన్ డాలర్లు గెలుచుకున్న వ్యక్తి ఆ సొమ్మును క్లెయిమ్ చేసుకునేందుకు అవసరమైన గుర్తింపు కార్డులు లేకపోవడంతో తన ప్రియురాలిని నమ్మాడు. ఆ టికెట్ ఆమె చేతికిచ్చి సొమ్ము చేయమన్నాడు. ఆ టికెట్‌ను తీసుకెళ్లి సొమ్ముచేసుకున్న ఆమె మళ్లీ కనిపిస్తే ఒట్టు. మిలియన్ డాలర్ల డబ్బుతో తన తాజా ప్రియుడితో పరారైంది. కెనడాలోని విన్నిపెగ్‌లో జరిగిందీ ఘటన. లారెన్స్ క్యాంప్‌బెల్ అనే వ్యక్తి 5 మిలియన్ కెనడియన్ డాలర్ల (30 కోట్ల రూపాయలు) లాటరీ టికెట్ కొనగా ఈ అనుభవం ఎదురైంది. డబ్బుతో పారిపోయిన ప్రియురాలి నుంచి తమ సొమ్ము తనకు ఇప్పించాలంటూ న్యాయపోరాటానికి సిద్ధమయ్యాడు. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను మెక్‌కే కొట్టిపడేసింది. కోర్టులోనే తేల్చుకుంటానని తేల్చి చెప్పింది.*

# గంటకు 3,000 మైళ్ల వేగం!

**సమీప భవిష్యత్తులోనే సూపర్‌సానిక్ జెట్ కల సాకారం • న్యూయార్క్ నుంచి పారిస్‌కు 55 నిమిషాల్లోనే**

న్యూఢిల్లీ: శబ్ద వేగానికి మించిన వేగంతో మానవుడు ప్రయాణించగలిగే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. వీనస్ ఏరోస్పేస్ కంపెనీ నిర్వహించిన ప్రపంచంలోనే మొట్టమొదటి రొటేటింగ్ డిటొనేషన్ రాకెట్ ఇంజిన్ (ఆర్‌డీఆర్‌ఈ) అట్మాస్ఫియరిక్ టెస్ట్ విజయవంతమైంది. ఈ పరీక్ష మే 14న న్యూ మెక్సికోలోని స్పేస్‌పోర్ట్ అమెరికాలో జరిగింది. ఈ కంపెనీ సీఈఓ సస్సీ డగ్‌ల్‌బై మాట్లాడుతూ, ఐదేళ్ల నుంచి చేస్తున్న కృషి ఫలించిందన్నారు. ఈ ఇంజిన్‌ను హైపర్‌సానిక్ జెట్ స్టార్‌గేజర్‌కు ఉపయోగించాలని ప్రయత్నిస్తున్నామన్నారు. ఇది శబ్ద వేగం కన్నా నాలుగు రెట్లు (గంటకు 3,069 మైళ్లు) ఎక్కువ వేగంతో ప్రయాణించగలదని చెప్పారు. అత్యధిక వేగంతో కూడిన ప్రయాణాలు సాగించే దిశగా ఇది మరో ముందడుగు అని తెలిపారు. దీనిని ప్రజా రవాణాకు ఉపయోగించేందుకు అనుమతి లభిస్తే, న్యూయార్క్ నుంచి 3,625 మైళ్ల దూరంలోని పారిస్‌కు 55 నిమిషాల్లోనే చేరుకోగలదని తెలిపారు. 2030వ దశకం ప్రారంభంలోనే దీనిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రూ.282 కోట్ల విలువైన




ఈ స్టార్‌గేజర్‌లో ఒకసారి 12 మంది ప్రయాణికులు ప్రయాణించే విధంగా ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు.

### 1980వ దశకం నుంచి ప్రయోగాలు

సంప్రదాయ రాకెట్ ఇంజిన్లతో పోల్చినపుడు ఆర్‌డీఆర్‌ఈల సమర్థత మెరుగ్గా ఉంటుంది. అంతేకాకుండా ఈ ఇంజిన్ పరిమాణం తక్కువ కావడంతో అడ్వాన్స్‌డ్ ఏరోస్పేస్ అప్లికేషన్స్‌కు అనుకూలంగా ఉంటుంది. ఈ టెక్నాలజీ కేవలం కృత్రిమ, నియంత్రిత వాతావరణంలో, ప్రయోగశాలలో మాత్రమే కాకుండా, వాస్తవంగా గగనతలంలో పని చేస్తుందని రుజువు చేశామన్నారు. అత్యధిక బలంతో తోయగలిగే ఆర్‌డీఆర్‌ఈని ఆచరణలో సాధ్యం చేయడం కోసం 1980వ దశకం నుంచి ప్రయోగాలు జరుగుతున్నాయన్నారు.

### మాక్ 6 వేగాన్ని మించి

వీనస్ కంపెనీ ఆర్‌డీఆర్‌ఈని ఇదే కంపెనీకి చెందిన ప్రత్యేకమైన వీడీఆర్2 ఎయిర్‌బ్రీథింగ్ డిటొనేషన్ రామ్‌జెట్‌తో కలిసి పనిచేసే విధంగా తయారు చేశారు. ఇది అడ్వాన్స్‌డ్ ప్రొపల్షన్ సిస్టమ్. ఇది అత్యంత వేగంగా ప్రయాణించడం కోసం రొటేటింగ్ డిటొనేషన్ టెక్నాలజీని ఉపయోగిస్తుంది. ఫలితంగా శబ్ద వేగం కన్నా 5రెట్ల వేగంతో ప్రయాణించగలదు. ఇది వాతావరణంలోని గాలిని తీసుకుంటుంది. రాకెట్లు అయితే తమ వెంట ఆక్సిజన్‌ను తీసుకెళ్లవలసి ఉంటుంది. ఇది నెమ్మదిగా మండటానికి బదులుగా, సూపర్‌సానిక్ షాక్ వేవ్స్‌ను ఉపయోగించుకుంటుంది. దీంతో ఎయిర్ క్రాఫ్ట్ రన్‌వేపై నుంచి బయల్దేరి మాక్ 6 వేగాన్ని మించి ప్రయాణించే అవకాశముంటుంది.

### గతంలో కంకోర్డ్

స్టార్‌గేజర్ ప్రజలకు అందుబాటులోకి వస్తే, కంకోర్డ్ తర్వాత శబ్ద వేగాన్ని మించి ప్రయాణిస్తూ ప్రయాణికులను తీసుకెళ్లిన మొదటి కమర్షియల్ విమానంగా రికార్డు సృష్టిస్తుంది. కంకోర్డ్ 20 ఏళ్ల క్రితం రిటైర్ అయింది. అది 60,000 అడుగుల ఎత్తులో ప్రయాణించింది. స్టార్‌గేజర్ అంతకన్నా వేగంతోపాటు, 1,10,000 అడుగుల ఎత్తులో ప్రయణిస్తుందని వీనస్ ఏరోస్పేస్ చెప్తున్నది. కంకోర్డ్ ప్రయాణికుల మాదిరిగానే స్టార్‌గేజర్ ప్రయాణికులు కూడా భూవక్ర రేఖను చూడగలుగుతారని చెప్తున్నది.



## జగన్నాథుడి రథానికి సుఖోయ్ టైర్లు

*కోల్‌కతా: జగన్నాథుడి రథ చక్రాలుగా సుఖోయ్-30 యుద్ధ విమాన టైర్లను వినియోగించనున్నారు. కోల్‌కతాలోని జగన్నాథ ఆలయ నిర్వాహక సంస్థ ఇస్కాన్ ఈ విషయాన్ని వెల్లడించింది. గతంలో స్వామివారి రథానికి బోయింగ్ విమాన టైర్లను వినియోగించేవారు. అయితే గత 15 ఏండ్లుగా వీటిని కొనుగోలు చేయడం ఇస్కాన్‌కు సాధ్యపడలేదు. జగన్నాథుడి రథానికి అనువైన టైర్ల కోసం అప్పటి నుంచి ఇస్కాన్ అన్వేషిస్తున్నది. సుఖోయ్-30 యుద్ధ విమాన టైర్లను వినియోగించాలని నిర్ణయించింది. సుఖోయ్ బృందం రథాన్ని పరిశీలించి దానికి అనువైన టైర్లను తయారు చేసి ఇచ్చింది. దీంతో సుఖోయ్ టైర్లు కలిగిన రథ చక్రాలపై జగన్నాథుడు కోల్‌కతా వీధుల్లో ఊరేగనున్నాడు.*